

# చిట్కా

"యాడికి వొయ్యొస్తున్నవ్?" అరగంటసేపు మిత్రుడు రావు కోసం వాళ్లింట్లోనే పడిగాపులు కాసి, చివరికి ఓపిక ఆవిరైపోయే క్షణంలో ప్రత్యక్షమైన సదరు సౌజన్యరావునడిగాడు లింగం-అలియాస్ రామలింగం.

ఎగాదిగా చూశాడు రావు.

"అరె! యాడికి వొయ్యొస్తున్నవంటె గట్ల జూస్తవు? పొయ్యేటప్పుడు అడిగితె తప్పువడతరుగాని, వచ్చినంక అడుగరాదా?" మరింత చురుగ్గా లింగం.

"డాక్టరు వద్దకి" తప్పదన్నట్టు క్లుప్తంగా చెప్పి కూలబడ్డాడు ఎదురుగా.

"ఏ డాక్టరు? గుడ్డోడా? చెవిటోడా?" సీరియస్‌గా లింగం.

ఈ సంభాషణ లోపలి గదిలోంచి వింటున్న రావు భార్య సుభద్రకు నవ్వాగలేదు.

పిచ్చివాడ్ని చూసినట్టు చూశాడు రావు. "అంటే, నేను గుడ్డోడి దగ్గర, చెవిటోడి దగ్గర వైద్యం చేయించుకునే అనాకారి వెధవలా కనిపిస్తున్నానా?"

నీవేగాదు, ఈ దునియాల ఎవ్వడైనా వీళ్లిద్దరి దగ్గరికే పోతున్నరిప్పుడు" సోఫాలో రిలాక్సవుతూ బోధిసత్వుని లెవెల్లో పోజిచ్చాడు.

"అర్థమయ్యేట్టు జెప్పరా?" చికాకు నణచుకునే వ్యర్థప్రయత్నం- రావు.

"అరె, గిండ్ల అర్థం గానిదేముంది బై? ఆలోపతి డాక్టర్లు కండ్లారా రిపోర్టులు జూసిగాని మందియ్యరు. అంటే చెవిటోళ్లేగద! ఇక హోమియో డాక్టర్లున్నరు. గిప్పుడు వీళ్లే ఎక్కువ ఫేమస్ అనుకో వీళ్ళకు చెవులే ముఖ్యం చెప్పాలె... చెప్పాలె... చెప్పాలె. గంటసేపు ఇచ్చులు-పచ్చుకాయలడిగి, పుస్తకాలు జూసి-వైద్యం జేస్తరు. వీళ్లకు రిపోర్టుల్తో పని లేదుగదా!" తాను గ్రహించిన జీవిత సత్యం చెప్పాడు లింగం.

"ఔరా!" అనుకున్నారు - బయట రావు, లోపల సుభద్రా ఒకేసారి.

"హుం! ఏ డాక్టరు దగ్గరికెళ్లినా ఏముందన్నయ్యా" గుమ్మందాకా వచ్చి తన అనుభవసారం వినిపించసాగింది సుభద్ర. "వాళ్లేదో మందులు రాసిస్తారు. ఎక్సర్ సైజులు చెయ్యమంటారు. వాకింగ్ చెయ్యమంటారు. ఈయన పరిస్థితేమో తింటే ఆయాసం - తినకపోతే నీరసం! అయినా నలభై దాటాం. వచ్చిన పొట్టను కాదను కుంటే పోతుందా? మరీ కష్టమైనప్పుడు..."

"నువ్వు నోరు మూస్తావా!" కసురుకున్నడు రావు.

'అబ్బో! మొగోడే! పెండ్లాన్ని కసిరిచ్చుకుంటున్నడు!' అనుకున్నాడు లింగం.

"నీకేం! నువ్వు ఇంట్లో నాలుగ్గోడల దూరం కొలిస్తే చాలు! నేను నలుగురిలో తిరిగేవాణ్ణి. ఎలా వుంటుంది?! పదేళ్ల క్రితం హీరోలకు హీరోలా వున్నానవాళ్లు అంతా!..." రావు మాట పూర్తి కాలేదు.

"మరి గిప్పుడు?" కుతూహలం ఆపుకోలేక పోయాడు లింగం.

"ఐరన్‌లెగ్గుకి అన్నలా వున్నానంటున్నారు మొహమ్మీదే. ఆ మహానుభావుడికి లెగ్గులన్నా వున్నాయి. మన పరిస్థితి... కట్టెపుల్లల మీద కుంభం పెట్టినట్టే" రావుకి తనమీద తనకే ఎంత అసహ్యంగా వుందో తేలిపోయింది.

"మరదే నేనూ చెప్పేది. ఇరవయ్యేళ్లకూ నలభయ్యేళ్లకూ ఒకేలా వుండటమెలా కుదురుతుంది?" మళ్లీ సుభద్ర విసురు.

ఆ ఎడతెగని సమస్యను వింటూ, సుభద్ర చేతి పకోడీలు తిని, టీ తాగి అన్యమనస్కంగానే అక్కడినుండి బయటపడ్డాడు లింగం.

సౌజన్యారావూ, రామలింగం మంచి మిత్రులు. భిన్న ధృవాల లాంటి గోదావరి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వీళ్లిద్దరినీ ఉద్యోగ ప్రయత్నం హైదారాబాద్ సాక్షిగా

ఒక్కటి చేసింది. అందర్నీ ఆకట్టుకునే లింగం మాటకారితనం రావుకీ, రావు మృదుస్వభావం లింగానికీ నచ్చింది. ఇద్దరూ కుటుంబ మిత్రులయ్యారు. నగర జీవనంలో రక్తసంబంధాల కన్నా మైత్రీబంధాలే దృఢంగా వుండటం- జగమెరిగిన సత్యమే. పెళ్లిళ్లయ్యాక ట్రాన్స్‌ఫర్ వీళ్లిద్దరినీ కొంచెం దూరం చేసినా మైత్రీబంధం సడలలేదు. అవకాశాన్ని బట్టి... ఒక్కోసారి అవకాశం కల్పించుకొనీ ఒకరి నొకరు కలుసుకోవడం మానలేదు.

ఈ మధ్య రావుకి పొట్ట పెరుగుతుందన్న విచారం పట్టుకుంది. నిత్యం నున్నటి షేవింగ్‌తో అందంగా కనిపించే రావుని ఆఫీసులో, చుట్టుపక్కల వాళ్లంతా ఆరాధనగా (కొందరు అసూయగా కూడా) చూస్తారు. బంగారానికి తావిలా అతని మృదుస్వభావం.

గత కొంతకాలంగా పొట్ట పెరగడం ఓ మానసిక జబ్బులా మారింది. ఇప్పుడది ఇంతింతై వటుడింతై అన్నట్లు మరో ఆలోచనకు తావులేని స్థితిలోకి అతన్ని నెట్టేసింది.

కొత్తలో ఓ జిమ్‌లో చేరాడు. ఒకటి రెండురోజులు మాస్టర్ గైడ్ ప్రోత్సాహం ఉత్సాహాన్నిచ్చింది. కాని, రాన్రానూ అది తనవల్లయ్యే పనిలా అనిపించలేదు. ముఖ్యంగా పొద్దున్నే లేవడం రావుకి దాదాపు అసాధ్యమైంది. రాత్రంతా ఏవో ఆలోచనలతో నిద్రపట్టక తెల్లవారుఝామునే కమ్మని నిద్ర ముంచుకొచ్చేది. మరుసటిరోజు ఉదయాన్నే తాను స్వయంగా సెట్ చేసుకున్న అలారం పీసు మోత యముడి కంచు ఘంటికల్ని తలపించేది. వెంటనే దాని గొంతు నొక్కేయడం, మరింత బిగదీసుకొని పడుకోవడం... అలా ఉదయాలు ఉఫ్ అయిపోయాయి. కట్టిన ఫీజు గిట్టుబాటు కోసమైనా సాయంత్రం వెళ్దామంటే ఆఫీసులో తీరేదిగాదు. ఒకవేళ తీరినా ఓపిక వుండేదికాదు. రెండూ కుదిరాయనుకున్ననాడు మరో ప్రోగ్రాం సిద్ధంగా వుండేది-'రాజుగారి కుక్క' సామెతలాగా(కుక్క కనిపిస్తే రాయి దొరకదు, రాయి దొరికితే కుక్క కనిపించదు, రెండూ కుదిరితే - రాజుగారి కుక్క). అంతే ఆ ప్రయాస అలా నీరుగారిపోయింది.

ఆపద్బంధు పథకంలా అప్పుడే ఎస్.ఎస్.వై. దర్శనమిచ్చింది. 'ఏ మందులూ-మాకులూ లేకుండా, కఠినమైన ఎక్సర్‌సైజుల జోలికి పోకుండానే వొంటి బరువు తగ్గించుకొని, నవనవలాడే ఆరోగ్యంతో వర్ధిల్లే మార్గం చూపిస్తా'నని.

ఆ మాట అక్షర సత్యమనిపించింది రావుకి. ఇక్కడ కూడా 'పొద్దున్నే లేవడ' మనే బాలారిష్టమున్నా, క్లాసుల ప్రభావమో, ఆమార్గంలోని గొప్పదనమో, మరి ఈ రెండూగాక అందులో పాల్గొనే రకరకాల వ్యక్తుల పరిచయమోగాని రాత్రి తేలిగ్గా నిద్రపట్టేది. ఉదయం కొంచెం ఇబ్బందిపడ్డా, తేలిగ్గానే నిద్రలేచేవాడు. వాళ్లు చెప్పినట్టే

వారం రోజుల్లో మూడుకిలోల బరువు తగ్గాడు. కాని, అత్తిపత్తిలా ముడుచుకున్నంత తేలిగ్గా మళ్లీ విచ్చుకోవడం జరిగిపోయింది. శిక్షణ తర్వాత వారం తిరక్కుండానే వాళ్లు చెప్పిన నియమాలూ, చేయమన్న యోగా తుంగలో తొక్కేశాడు. జిహ్వా చాపల్యం, సుఖనిద్ర భయాలకు తట్టుకోలేక అవి అందనంత దూరం పారిపోయాయి.

అంతలో ఓ బెల్టులమ్ముకునేవాడు సరాసరి వీళ్ల ఆఫీసుకే వచ్చాడు- పిలిచి నట్టు. ఏ ఎక్సర్‌సైజులూ లేకుండా అనవసరమైన ఫ్యాట్‌ని తగ్గించే అరచేతి వెడల్పు బెల్టు చూయించాడు. ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎలాగైనా దాన్ని వాడవచ్చని ఓ 'డెమో' ఇచ్చాడు. స్వయంగా రావుకే పెట్టి చూయించాడు. ఏషియన్ పెయింట్స్ - యాడ్ లోలాగా. 'అద్భుతం' అనుకున్నాడు రావు. 'నాలాంటివాళ్ల కోసమే ఇది అవతరించి నట్టుంది. ఎంతకైనా సరే, దీన్ని కొనుక్కోవాల్సిందే' అని తీర్మానించుకున్నాడు.

వాడు రేటు - 'రెండువేలు' అనగానే మిగతా వాళ్లంతా పెదవి విరిచారు రావు ఏదో అనబోతుండగా-

"మా అక్క వాళ్ల ఆఫీసులో అయిదొందలకే ఇస్తానన్నాడట!" అంటూ మోకాలొడ్డింది మౌనిక.

అంతే! ఆ అమ్ముకునేవాడు మరో మాట మాట్లాడలేక బిక్కమొగమేసి బ్యాగు సర్దుకోసాగాడు. రావు గుండెలు దడదడలాడాయి. 'ఓ వెయ్యికయినా అడగకుండా ఇలా చేసేసిందేమిటి ఈ మౌనిక?' అంటూ గొంతుదాకా కోపమొచ్చేసింది. ఆవిడ మీద. అయినాసరే, ఎంతకయినా కొందామని ఏదో అనబోతూంటే వద్దంటూ కళ్లతోనే హెచ్చరిక చేశాడు కామేశం. ఆ వచ్చినవాడు మెట్లుదిగి వెళ్లిపోతూంటే వరమీయవచ్చిన దేవతను వద్దనే పాతాళ భైరవి సినిమాలోని రేలంగి గుర్తుకొచ్చాడు రావుకి. వెంటనే జరిగిన పొరబాటు గ్రహించి వాడివెంట పడ్డాడు. ఎట్టకేలకు వాడ్ని పట్టుకొని రెండువందల యాభై రూపాయల తగ్గింపు ధరతో దాన్ని సాధించాడు. కాని, వాడు చెప్పిన ఫలితం మాత్రం సాధించలేకపోయాడు. పనిలో పనిగా ఆఫీసులో కొంత చులకనైపోయాడు కూడా.

జూదంలో ఓడిపోతున్న ధర్మరాజుకి పట్టుదల పెరిగినట్టుగా రావుకి బరువు తగ్గించుకునే విషయంలో బాధా, పట్టూ అనులోమానుపాతంగా పెరిగాయి. కాని, షరా మామూలుగా ఫలితాలు వస్తూండటంతో అతని చిరాకూ - పరాకూ దినదిన ప్రవర్ధమానం కాసాగాయి.

ఆరోగ్యం బాగా లేదని తెలిసి, అతడ్ని పలకరించేందుకొచ్చిన లింగం, రావు స్థితిచూసి చాలా బాధపడ్డాడు. అతని సమస్య తీర్చడం మిత్రునిగా తన విధ్యుక్త ధర్మమని భావించాడు. ఓ నాలుగు రోజులు అదే పనిగా ఆలోచించిన మీదట ఓ బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది లింగానికి. ఆలస్యం చేయకుండా ఆచరణలో

పెట్టేశాడు వెంటనే. కొంత వ్యయప్రయాసలకోర్చినా అనుకున్నది అనుకున్నట్టు జరగడం లింగానికెంతో సంతృప్తినిచ్చింది.

ఇది జరిగి సరిగ్గా ముప్పై ఎనిమిది రోజులైంది. ఈ ముప్పై ఎనిమిది రోజుల్లోనూ లింగం రావును కలుసుకోలేకపోయాడు. కారణం - రాజకీయాలు. లింగం బావమరిది ఎంపీటీసీ సీటుకి పోటీ చేయడం అందుకు లింగం వాక్చాతుర్యాన్నీ, పరిచయాల్నీ వాడుకోవడం మూలాన అసలు సొంత విషయాలే ఆలోచించలేనంత బిజీ అయిపోయాడు పాపం! నాలుగు రోజులుగా ఇంటి గడప తొక్కని లింగం ఆ రోజు సడెన్‌గా ఇల్లు చేరుకోగానే గొల్లుగొల్లుమని ఏడ్చింది భార్య. ఏం జరిగిందో ఊహించుకోలేక కంగారుపడిపోయాడు.

ఏడుపైపోయింతర్వాత 'చావు కబురు చల్లగా' చెప్పినట్టు మెల్లగా చెప్పిందా ఇల్లాలు - "రావన్నయ్యగారి పరిస్థితి అయోమయంగా వున్నదట. మూడ్రోజుల నుండీ మీకోసం ఫోన్లు చేస్తూనే వుంది వదిన..."

సడెన్‌గా తేదీ చూశాడు లింగం. ఇరవై అయిదు.

"వామ్మో!" అంటూ గావుకేక పెట్టాడు. మరుక్షణం "సిరికింజెప్పడు..." అన్న చందాన పరుగులంకించుకున్నాడు.

* * *

గుమ్మంలో అశోక వనంలోని శోకదేవతలా జుట్టు చెరిగి, బొట్టు కరిగి దర్శనమిచ్చింది సుభద్ర. పిల్లలిద్దరూ బిక్కుబిక్కుమంటూ సోఫాకి చెరోమూల కూర్చుని వున్నారు.

గుండె చిక్కబట్టుకుంటూ అడిగాడు లింగం..."రావు....?"

"బెడ్‌రూంలో..." ఆమె ఏడవడం లేదు. కాని, అంతకుమించిన బాధేదో ఆమె గొంతును నొక్కేస్తూంది.

పరుగులాంటి నడకతో వెళ్లి బెడ్‌రూం డోర్ తెరిచి, లోపల దృశ్యం చూసి స్థాణువయ్యాడు... అజామీళునిలాగా చావుబతుకుల మధ్య కొట్టుకుంటూ "నారాయణా! నారాయణా!" అంటూ భగవన్నామస్మరణ చేస్తున్నాడేమో అనుకుంటే...

రావు హాయిగా బెడ్‌రూంని డైనింగ్ హాల్‌లా మార్చేసుకున్నాడు. మంచం మీద తిష్ట వేసిన ఆ ఆకారం రావుదేనని పోల్చుకోవడం కష్టమైంది. బకాసురుని తమ్ముడిలా అనిపించే రావు ఇప్పుడు కుంభకర్ణుని బాబాయిలా కనిపిస్తున్నాడు.

ఆ గది అంతా తినిపారేసిన ఖళీ కవర్లతో, ప్యాకింగ్ పేపర్లతో, ఖాళీ మందుబాటిళ్లతో, సోడా బాటిళ్లతో నిండిపోయి వుంది. పక్కనే మరో ఫుల్ బాటిల్ సగం సీసాదాకా వుంది. ఎదురుగా పెద్ద స్టీల్ బేసిన్‌లో చికెన్ పీసెస్...గుప్పుమం టోంది వాసన.

నెమ్మదిగా గదిలోకడుగుపెట్టాడు.

"అరె! ఏందివయా ఇది?" మెత్తని మందలింపు లింగం.

చివ్వున తలెత్తి చూశాడు రావు. కళ్లు ఎర్రగా నెత్తురు పేరుకుపోయి నట్టున్నాయి.

ఏదో తెలీని భయం లింగాన్ని వణికించింది.

"ఒరేయ్ లింగం..." ఒక్క ఉదుటున లేచి, లింగాన్ని వాటేసుకుని చిన్నపిల్లాడిలా ఏడ్చాడు రావు.

లింగం తేరుకొని రావును సముదాయించాడు. 'రావు చావలేదు. అంతే చాలు. కాని, పీలగా మారుతాడనుకున్న మనిషి రివర్స్‌గేర్‌లోలా ఇలా లావెక్కి పోయాడెందుకో!' అనుకుంటూ పరిపరి విధాల ఆలోచించసాగాడు.

బాధంతా కన్నీళ్ల రూపంలో కడిగేసుకున్నాక రిలాక్స్‌గా కూర్చున్నాడు రావు.

"ఎందుకిట్ల తయారైనవ్?" ఏమీ తెలియనట్టే ప్రశ్నించాడు లింగం.

రావు వెంటనే సమాధానం చెప్పలేదు.

ఇంతలో లింగం సెల్ తీసి ఏదో నెంబర్ నొక్కి జావేద్‌ని రమ్మని పిలిచాడు.

"ఏం చేయనురా... మనసులోని బాధ ఎవరికీ చెప్పుకోలేక, దాచుకోలేక నాలో నేను నలిగిపోయాను. నీకోసం ప్రయత్నిస్తే నువ్వు దొరకలేదు. పదిహేను రోజులు అన్నం సయించలేదు..."

"ఇంతకూ బాధెందుకువయా?" అడ్డుకున్నాడు లింగం.

"ఆరోజు నువ్వూ నేనూ ప్రియదర్శిని హోటల్లో బెంగుళూరు స్వామీజీని కలసేందుకు వెళ్లాం కదా! నీతో స్వామీజీ ఏం మాట్లాడాడో తెలీదు. కాని, నాకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని చాలా ఖచ్చితంగా చెప్పాడు. ఎప్పుడో జరిగిన సంఘటనలు మొదలు, నిన్న మొన్నటి సంగతుల దాకా... నాకు అతనిపై పూర్తి నమ్మకం ఏర్పడింది... ఆ తర్వాత ఓ భయంకరమైన విషయం చెప్పాడు... కాని, 40వ రోజు దాటితే గండం గడుస్తుందని... శాపవిమోచనంలా ఓ మాట చెప్పాడు... లింగం! పుట్టిన ప్రతి ఒక్కడూ చస్తాడు గదరా!" రావు కళ్లనుండి నీరు... మాట్లా

డటం ఆపలేదు. మందు ప్రభావమో, చావు తెగింపో, ఓ రకమైన మైకంలో అలా కొనసాగించాడు-

"ఎలాగూ చావు తప్పనప్పుడు ఈ వెర్రి మొర్రి ప్రయాసలన్నీ అనవసర మనిపించింది... బ్రతికిన నాలుగు రోజులూ లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యడమే మేలనిపించింది."

"ఆఫీసుకి సెలవు పెట్టాను..."

"సుభద్రనీ... పిల్లల్నీ తీసుకుని యాదగిరి గుట్టకు ఒకరోజు... ఫిల్మ్‌సిటీకి... ఓషియన్ పార్క్..." ఇలా ఎక్కడెక్కడో తిరిగాను. విచిత్రంగా- ఇంతకుముందు నాకు కనిపించని అద్భుతమైన సౌందర్యం ఇప్పుడు చూడగలిగాను.

"నాలుగు రోజుల నుండీ పిచ్చెక్కినట్టుంది... ఎవ్వరితో మాట్లాడాలనీ, ఎవ్వరినీ చూడాలనీ లేదు... అందుకే ఇలా.. ఒరే లింగం! నేను పోతే..." లింగం చేతులు పట్టుకుని, కడుపులో తల పెట్టి, పసిపిల్లాడిలా ఏడ్చాడు.

లింగం రావుని గట్టిగా కౌగిలించుకునానడు. "ఒరేయ్! నీవు చావవురా! నిండా నూరేండ్లు బతుకుతవ్! నేను గ్యారంటీ ఇస్తున్న గద!" భరోసా ఇస్తున్నట్టు వీపు నిమిరాడు.

ఆలింగనం వీడి అపనమ్మకంగా చూశాడు రావు.

"ఏం రా? నమ్మకం లేదా? నీవు నన్ను మాఫ్ జెయ్యాలెరా... నిన్ను గిట్ల పరేషాన్ జేసింది నేనే..."

ఇంతలో జావేద్ వచ్చాడక్కడికి. లింగం గమనించినా, రావు దృష్టి మాత్రం లింగం మీదే వుంది.

"ఏ మందులూ, ఎక్సర్‌సైజులూ నీ బాధ తీర్చలేకపోతున్నయ్ గదా... ఎట్ల జేతం? అంటాని దమాక్‌లడాయించిన. చిన్నప్పటిది ఓ కథ గుర్తుకొచ్చింది. ఓ మారాజు గిట్లనే లావు పెరిగిపోతుంటే ఓ వైద్యుడు **40** రోజులల్ల నువు సచ్చిపోత వంటాని ఒక చిట్కా ఇసిరిండంట. ఇంకేం, ఆ మారాజు గదే పరేషాన్‌ల సగానికి సగమైపొయ్యిండంట..."

మనసు నలుముకున్న మబ్బులేవో వీడిపోతున్న ఫీలింగ్ - రావులో.

"గదే చిట్కా నీమీద ప్రయోగం జెయ్యనీకె... నీమీద గా స్వామీజీని ప్రయోగం జేసింది నేనే!" లింగం చెప్పడం ఆపాడు.

ఆనందం, అపనమ్మకం, అయోమయం కలగలిసిన చూపుల్తో - రావు.

"మా ఆఫీసులో కొత్తగా జేరిన జావేద్ స్టేజీ ఆర్టిస్టు. హోటల్లో రూం బుక్ చేసి, అతనికి వేషం గట్టించి..." రావులో మారుతున్న రంగుల్ని గమనిస్తున్నాడు లింగం.

"అబద్ధం...!" అరిచాడు రావు.

"సత్యం నాయనా! అబద్ధం చెప్పాల్సిన అవసరం మాకు లేదు! మా వాక్కుకి తిరుగులేదు. మాతా ఉపాసకులం...!" ఎదురుగా జావేద్.

"కరెక్ట్ అదే గొంతు! అవే మాటలు!!" సంతోషం, సంభ్రమంలో రావు ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఒరే...దుర్మార్గుడా! నన్నే చంపాలని జూస్తావురా!" అరుస్తూ లింగంపైకి లేచాడు రావు.

"శరణు శరణు మహారాజా!" డ్రమెటిక్‌గా అతనిముందు మోకరిల్లాడు లింగం.

అప్పటికే అక్కడికి చేరిన సుభద్రా, పిల్లలూ ఆ దృశ్యం చూసి గొల్లున నవ్వారు.

అందరి కళ్ళలో ఆనందబాష్పాలు చిందులేశాయి.

'అయ్యో! నా చిట్కా ఇలా బెడిసికొట్టిందే! అయినా పర్లేదులే - మావాడి ప్రాణం గట్టిది. దానికే ఢోకా రాలేదు' అనుకుంటూ మురిసిపోయాడు లింగం.

మునుపటికంటే సైజు పెరిగిన పొట్టను చూసి ఒకింత బాధనిపించినా నిజమైన ఆనందాన్నీ, బాధనూ అనుభూతించగలిగాడు రావు.

**(04-03-2004 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)**

...థ నిలయం
శ్రీకాకుళం